www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 21 ఆగస్టు 2024
5
ఏలూరు

శిశుగృహ సేవలు భేష్ : కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న శిశు గృహ సేవల పట్ల కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంతృప్తి వ్యక్తం చేశారు. నగరంలోని శిశు గృహాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శిశుగృహంలో ఉన్న బాల బాలికల వివరాలు, ఆరోగ్య పరిస్థితి, వారి పోషకాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎంతమందిని దత్తత ఇచ్చారని ఆరాతీశారు. అక్కడ ఉన్న ఒక చిన్నారిని ఎత్తుకొని ఆడించారు. శిశు గృహానికి వచ్చిన పిల్లలను అవసరమైన వారికి దత్తత ఇవ్వడం ద్వారా శిశుగృహంపై నమ్మకం కలుగుతుందన్నారు. శిశు గృహంలో ఉన్న పాల ప్యాకెట్లను పరిశీలించారు. కలెక్టర్‌తో పాటు మహిళాభివృద్ధి, శిశుసాధికారిత అధికారి కెవిఎస్‌ఎల్.పద్మావతి, జిల్లా బాలల సంరక్షణ అధికారి సిహెచ్.సూర్యచక్రవేణి, మున్సిపల్ కమిషనర్ డి.చంద్రశేఖర్, ఇతర సిబ్బంది ఎ.దుర్గాప్రసాద్, సిహెచ్.శ్రీకాంత్, శిశుగృహ సిబ్బంది ఉన్నారు.

వైసిపి సారథి ఎవరు..!



జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని రాజీనామాతో శ్రేణుల్లో నిస్తేజం
కొత్త సారథి కోసం వైసిపి అధిష్టానం మల్లగుల్లాలు
కైకలూరు మాజీ ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు పేరు పరిశీలన
ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిపైనా కసరత్తు
ఎన్నికల్లో ఓటమితో ముఖం చాటేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో వైసిపి గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటుంది. ప్రముఖ నాయకులంతా ఎన్నికల్లో ఓటమి తర్వాత బయటికి రాకుండా ముఖం చాటేస్తున్నారు. పశ్చిమ వైసిపిలో స్తబ్ధత కొనసాగుతుండగా, ఏలూరు జిల్లాలో పరిస్థితి వైసిపి అధినాయకులను ఆందోళనకు గురిచేస్తోంది. ఏలూరు జిల్లా అధ్యక్షునిగా ఉన్న ఆళ్ల నాని రాజీనామా ఆ పార్టీలో కలకలం రేపుతోంది. ఇప్పుడు వైసిపి ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఎవరనే దానిపై తీవ్ర చర్చ సాగుతోంది. గతంలో అధ్యక్ష పదవి కోసం పెద్దఎత్తున పోటీపడేవారు. మారిన రాజకీయ పరిస్థితుల్లో నాయకులు ఎవరూ జిల్లా అధ్యక్ష బాధ్యతలు తీసుకునేందుకు సుముఖత చూపడం లేదని తెలుస్తోంది. దీంతో వైసిపి అధిష్టానం జిల్లా అధ్యక్ష పదవి, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గా ఎవరిని నియమించాలనే దానిపై తీవ్రమైన కసరత్తు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఏలూరు జిల్లా అధ్యక్షునిగా దాదాపు పదేళ్లుగా ఉన్న మాజీ మంత్రి ఆళ్ల నాని హఠాత్తుగా ఆ పదవికి రాజీనామా చేశారు. ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పదవికి సైతం రాజీనామా చేశారు. తాజాగా ఆ పార్టీ సభ్యత్వానికి సైతం రాజీనామా చేయడం రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల్లో ఘోర ఓటమి తర్వాత రెండు జిల్లాల్లో వైసిపిలో అగ్ర నాయకులు ఎవరూ బయట కనిపించడం లేదు. ఎటువంటి కార్యక్రమాల్లోనూ పాల్గొనడం లేదు. వరదలకు జిల్లాలో రైతులు పెద్దఎత్తున నష్టపోయినా వైసిపి నాయకులు ఎవరూ రైతుల వద్దకు వెళ్లి పరామర్శించిన పరిస్థితి కనిపించలేదు. నిన్నటి వరకూ మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా ఉన్న నాయకులు సైతం పార్టీకి దూరంగా ఉంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆళ్ల నాని రాజీనామా వైసిపి అధిష్టానాన్ని తీవ్ర కలవరపాటుకు గురి చేసిందని తెలుస్తోంది. నిస్తేజంగా ఉన్న పార్టీకి జిల్లా రథసారథిగా ఎవరిని నియమించాలనే దానిపై అధిష్టానం మల్లగుల్లాలు పడుతున్నట్లు సమాచారం. ఏలూరు జిల్లాలో ఏడు నియోజకవర్గాలు ఉన్నాయి. నూజివీడు మాజీ ఎంఎల్‌ఎ మేకా ప్రతాప్‌అప్పారావు వయస్సు రీత్యా అధ్యక్ష బాధ్యతలు కష్టమనే అభిప్రాయం ఉన్నట్లు చెబుతున్నారు. దెందులూరు మాజీ ఎంఎల్‌ఎ అబ్బాయిచౌదరి ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆయన స్థానికంగా ఉండటం లేదు. లండన్‌లో ఎక్కువగా ఉంటున్నారని సమాచారం. ఉంగుటూరు మాజీ ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు, తెల్లం బాలరాజు ఇలా పలువురి పేర్లు పరిశీలన చేస్తున్నప్పటికీ సమర్థవంతంగా అధ్యక్ష బాధ్యతలు నిర్వహించే నాయకుడి కోసం అధిష్టానం చూస్తున్నట్లు చెబుతున్నారు. కైకలూరు మాజీ ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావును జిల్లా అధ్యక్షునిగా నియమించాలని వైసిపి అధిష్టానం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. సీనియర్ ఎంఎల్‌ఎ కావడంతోపాటు అందరినీ కలుపుకుని వెళ్లే స్వభావం నాగేశ్వరరావుకు ఉన్నట్లు భావిస్తున్నారని తెలుస్తోంది. ఆయనకు అధ్యక్ష పదవి ఇస్తారా.. మరో నాయకుడిని నియమిస్తారా వేచిచూడాల్సి ఉంది.

ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా గంటా ప్రసాద్..?

ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాధ్యతల నుంచి ఆళ్ల నాని తప్పుకోవడంతో ఆ స్థానం ఎవరితో భర్తీ చేయాలనే దానిపై అధిష్టానం ఆలోచిస్తోంది. పార్టీకి వెన్నుదన్నుగా ఉండే బొద్దాని శ్రీనివాస్, మంచెం మైబాబు వంటి నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేశారు. మేయర్ షేక్ నూర్జహాన్ భర్త పెదబాబు టిడిపికి దగ్గరైన పరిస్థితి ఉంది. దీంతో ఏలూరు నియోజకవర్గంలో వైసిపికి సమర్థవంతమైన నాయకులు లేకుండా పోయారు. దీంతో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ భర్త ప్రసాద్‌ను నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించాలనే యోచనలో వైసిపి అధినాయకులు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా భార్య పద్మశ్రీ ఉండటంతో ఆయన ఏలూరు వైసిపి నియోజకవర్గ బాధ్యతలు చేపడతారా అనే అనుమానాలూ ఉన్నాయి. ఇంకా దాదాపు రెండేళ్లపాటు ఛైర్‌పర్సన్ పదవీకాలం ఉంది. ఇప్పుడు వైసిపి నాయకునిగా కీలక పాత్ర పోషిస్తే జెడ్‌పి ఛైర్‌పర్సన్ పదవికి ఇబ్బందులు వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయం గంటా ప్రసాద్ అనుచరుల్లో వ్యక్తమవుతోంది. మరో నాయకుడు ఎవరూ కనిపించకపోవడంతో వైసిపి అధిష్టానం కలవరం చెందుతున్నట్లు చెబుతున్నారు. వైసిపి అధిష్టానం ఎవరిని ఎంపిక చేస్తుందో వేచిచూడాలి.

హాస్టల్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రభుత్వ బాలుర వసతి గృహ విద్యార్థుల ఆరోగ్యం, ఆహారం, చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలతో వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల వసతి గృహాలను జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్నిటినీ తనిఖీ చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఐసిడిఎస్ పీడీ, డిఇఒ, డిసిపిఒలను ఆదేశించారు. ఈ సందర్భంగా మంగళవారం శనివారపుపేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానంలో రాణించాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ బాలుర వసతి గృహంలో వసతి పొందుతున్న 63 మంది విద్యార్థులు, భిక్షాటన చేసే బాలురు, వివిధ కారణాల వల్ల తల్లిదండ్రులకు దూరమైన బాలలు ఏడేళ్ల వయస్సు నుండి 18 సంవత్సరాల్లోపు పిల్లలందరినీ ఆత్మీయంగా పలకరిస్తూ వారికి అందుతున్న సౌకర్యాలను గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్ పరిసరాలను, వంట గది, భోజనశాల, మరుగుదొడ్లు, ఆట స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. వసతి గృహంలో ఏమైనా సమస్యలున్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనం విషయంలో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించి రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, వసతి గృహం సూపరింటెండెంట్ పి.శ్రీవల్లి, ఐసిడిఎస్ పిడి కె.పద్మావతి, మున్సిపల్ కమిషనరు చంద్రశేఖర్, డిసిపిఒ సూర్యచక్రవేణి, తహశీల్దార్ శేషగిరి ఉన్నారు.

హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

శిక్షలను మరింత కఠినతరం చేయాలి

కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రజాసంఘాల నేతలు, మహిళలు డిమాండ్ చేస్తున్నారు. దేశంలో శిక్షలను కఠినతరం చేయాలని, బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతున్నారు. వైద్యురాలిపై దాడిపై పలువురి మనోగతం..

ప్రజాశక్తి - భీమవరం

మమతా బెనర్జీ బాధ్యత వహించాలి

డి.కళ్యాణి, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్

జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసిన కామాంధులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి. నాన్ బెలబుల్ కేసులు పెట్టాలి. ఇటువంటి ఘటనలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పూర్తి బాధ్యత వహించాలి. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలి. ఇతర దేశాల మాదిరి మనదేశంలో కూడా శిక్షలన్నీ కఠినతరం చేయాలి. మరొక్కసారి ఏ ఆడపిల్లకూ అన్యాయం జరగకుండా చూడాలి. మహిళలకు, యువతకు, చిన్నారులకు రక్షణ కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

మహిళలపై అఘాయిత్యాలు బాధాకరం

ఎస్.లారెన్స్ కుమారి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్

సమాజంలో మహిళల పట్ల వివక్ష కొనసాగడం దారుణం. ఎన్ని రక్షణ చట్టాలు ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో అమలు జరగడం లేదు. ముఖ్యంగా మహిళలు పనిచేసే చోట రక్షణ లేకుండా పోయింది. మహిళలను ఆట బొమ్మలుగా నేటికీ చూడడం అత్యంత బాధాకరం. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నప్పటికీ ఎందుకంత చిన్నచూపో అర్థం కాని పరిస్థితి. మహిళ వైద్యురాలిపై జరిగిన హత్యాచారం హత్యను ప్రతి ఒక్కరూ ఖండించి ముందుకొచ్చి న్యాయం జరిగే వరకూ పోరాడాలి.

కలకత్తాలో ఘటన దారుణం..

డాక్టర్ డి ఆర్ స్వర్ణలత
సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ప్రిన్సిపల్

కలకత్తాలోని మెడికల్ కళాశాలలో జరిగిన ఘటన అత్యంత దారుణం. జూనియర్ డాక్టర్‌పై సంజయ్‌రాయ్ మరి కొంతమంది కలిసి సామూహిక అత్యాచారం చేయడం అరాచకం. ఈ మధ్యకాలంలో ఇటువంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి. ప్రభుత్వం ఇటువంటి ఘటనలపై స్పందించాలి. అరాచకాలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలి. దుర్మార్గులను వారికి సహకరించిన వారిని న్యాయస్థానాలు క్షమించకుండా తగు గుణపాఠం చెప్పాలి. ఎవరైనా ఇటువంటివి పాల్పడడానికి భయపడే విధంగా నడిరోడ్డుపై శిక్షించాలి.

ఆడపిల్లలను బయటకు పంపాలంటే భయమేస్తోంది

చిల్లా అనూష, సర్పంచి, పెన్నాడ అగ్రహారం

నేటి సమాజంలో ఆడపిల్లలకు రక్షణ లేకపోవడం అత్యంత బాధాకరం. ఆడ పిల్లలను బయటకు పంపించాలంటేనే భయంకర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వైద్యురాలిపై అత్యంత కిరాతకంగా హత్యాచారం దుర్మార్గం. మహిళలు పని చేసే చోట రక్షణ లేకపోవడమే ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వం ఉన్న చట్టాలను మరింత పటిష్టం చేయాలి. తప్పు చేసిన ప్రతి వ్యక్తికీ శిక్ష పడేలా న్యాయస్థానాలు చర్యలు చేపట్టాలి.

శివారు ప్రాంత భూములకు సాగునీరందించాలి

ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కృష్ణా డెల్టా శివారు ప్రాంత భూములకు సాగునీరందక పంట భూములు బీటలు వారుతున్నాయని ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు, కౌలు రైతులు నిరసన తెలిపారు. మంగళవారం సాయంత్రం రైతు సంఘం నాయకులు బీటలు వారిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కృష్ణా డెల్టాకు శివారు ప్రాంతమైన ఏలూరు రూరల్ మండలంలోని మాదేపల్లి, లింగారావు గూడెం, కాట్లంపూడి, జాలిపూడి తదితర గ్రామాల్లో వందలాది ఎకరాలకు సాగునీరు అందడం లేదన్నారు. కృష్ణా, గోదావరి నదుల్లో సమృద్ధిగా నీరున్నా పంట భూములకు అందించలేని దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఓల్డ్ జాలిపూడి కాల్వ ఆయకట్టు పరిధిలో పంట భూములకు సాగునీరందకపోయినా జల వనరుల శాఖా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఎకరాకు రూ.15 వేల నుంచి 20 వేల రూపాయలు వరకూ పెట్టుబడి పెట్టిన అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి కృష్ణ డెల్టా శివారు ప్రాంత భూములకు సాగునీరందించి అన్నదాతలను ఆదుకోవాలని కోరారు. లేని పక్షంలో రైతులను సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్.సూర్యనారాయణ, ఆకునూరి బిక్షం, మారుమూడి ఏసు, తేర జాన్, కొరపాటి బుల్లబ్బాయి పాల్గొన్నారు.

రైతు సంఘం ఆధ్వర్యాన నిరసన తెలుపుతున్న నేతలు, రైతులు

తొలగించిన విఒఎలను విధుల్లోకి తీసుకోవాలి

డిఆర్‌డిఎ పీడీకి వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో అక్రమంగా తొలగించిన విఒఎలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఎపి వెలుగు విఒఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయరాజు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు డిఎన్‌విడి ప్రసాద్, కార్యదర్శి ఎస్‌కె.సుభాషిణి, జిల్లా నాయకులు మేరీ ఆయనను కలిసి నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత విఒఎలు ఎదుర్కొంటున్న రాజకీయ వేధింపులు, తొలగింపుల గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎప్పటి నుంచో విధులు నిర్వర్తిస్తున్న వారిని రాజకీయ వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం సమాచారం లేకుండా, ఏ తప్పూ లేకుండా మా ప్రభుత్వం మా ఇష్టం అన్నట్టుగా అక్రమంగా విఒఎలను తొలగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాయకులే నేరుగా వెళ్లి తెల్ల కాగితాలపై సంతకాలు చేయించి గ్రూపుల ఆమోదం తీసుకోకుండా, గ్రామ సంఘం సమావేశాలు ఏర్పాటు చేయకుండా విఒఎలను తొలగిస్తున్నారని విమర్శించారు. విఒఎలు ఆర్తనాదాలు చేస్తుంటే తమకు సంబంధం లేనట్టు అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. తమ ఆవేదనను అర్థం చేసుకోవాలని, వెంటనే తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని, తొలగింపులు ఆపాలని కోరారు. లేకుంటే ఈ నెలాఖరులో రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు.

డిఆర్‌డిఎ పీడీకి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

పలుచోట్ల నిరసన ర్యాలీలు

ప్రజాశక్తి - ఏలూరు

కొల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై హత్యాచారానికి పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా అధ్యక్షురాలు ఓరుగంటి శైలజా డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏలూరు నగర కమిటీ జిల్లా కోర్టు ఆవరణలో మంగళవారం నిరసన తెలిపింది. ఈ సందర్భంగా ఐలు జిల్లా అధ్యక్షురాలు ఓరుగంటి శైలజ మాట్లాడుతూ మహిళా వైద్యుల రక్షణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వైద్యుల రక్షణ చట్టం చేయాలని కోరారు. ఏలూరు నగర కార్యదర్శి గెద్దా విజయభాస్కర్ మాట్లాడుతూ మహిళా వైద్యులు కూడా రక్షణ పొందలేక పోవడం దారుణమన్నారు. నిరసనలో ఐలు నగర అధ్యక్షులు పి.వెంకట్, ఆర్.కిషోర్ కుమార్, ఆంజనేయులు, గంగా భవాని పాల్గొన్నారు.

ఏలూరులో...

జీలుగుమిల్లిలో...

కుక్కునూరు : మండలంలోని కూటమి నాయకులు, వైద్య సిబ్బంది 200 మందితో నల్ల జెండాలతో, కొవ్వొత్తులతో ప్రధాన సెంటర్ నుంచి స్థానిక ప్రభుత్వాసుపత్రి వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు ములిశెట్టి నాగు, జనసేన అధ్యక్షులు ములిశెట్టి యుగంధర్, కూటమి నాయకులు, ప్రభుత్వ వైద్యులు శ్రీనివాసరావు, రమేష్ వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : స్థానిక జగదాంబ సెంటర్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు కొవ్వొత్తులతో చేపట్టిన నిరసన ర్యాలీలో పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఆసుపత్రుల్లో పని చేసే వైద్యులకు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించేలా కృషి చేస్తానన్నారు.

వేలేరుపాడు రూరల్ : హైస్కూల్ వద్ద టిడిపి ఆధ్వర్యంలో ప్రారంభమైన ర్యాలీ మండల కేంద్రంలో ప్రధాన వీధుల గుండా కొనసాగింది. చౌరస్తా సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి మండలాధ్యక్షుడు అమరవరపు అశోక్ మాట్లాడారు.

కలిదిండి : స్థానిక శ్రీ సుగుణ జూనియర్ కళాశాల విద్యార్థులు కళాశాల నుంచి ప్రధాన సెంటర్ మీదుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు, అనంతరం పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. శ్రీ సుగుణ కళాశాల ఛైర్మన్ కారి రాజమణి, ప్రిన్సిపల్ తట్టుగొళ్ల వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బోటింగ్ ప్రమాదాల నివారణకు చర్యలు

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో బోటు ప్రమాదాల నివారణలో నిర్వాహకులు, ప్రయాణికులు, పర్యవేక్షించే అధికారులు ఈ ముగ్గురి పాత్ర ఎంతో కీలకమని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. బోటింగ్ ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా రెవెన్యూ, పర్యాటక, బోటింగ్, అగ్నిమాపక, పోలీస్, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో కలెక్టర్ కె.వెట్రిసెల్వి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో బోటింగ్ ప్రమాదాలను నివారించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా పోలవరం పాపికొండలు, బోటింగ్ విభాగానికి సంబంధించిన అధికారులతో కూడా కలెక్టర్ సమీక్షించారు. పాపికొండల ప్రాంతంలో విహార యాత్రాస్థలంగా ప్రసిద్ధి చెందిన పేరంటాలపల్లి వద్ద మినీ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్, పర్యాటక శాఖల నుంచి వివిధ కేటగిరిలో సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. బోటింగ్ ప్రమాదాలను నివారించేందుకు అవసరమైన ఎక్విప్‌మెంట్‌ను టూరిజం, రెవెన్యూ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వరదల సమయంలో ఇరిగేషన్‌వారి రూట్ మ్యాప్ ద్వారా మాత్రమే బోటింగ్ చేయాలని, బోటింగ్ నిలుపుదల చేసేటప్పుడు, కొనసాగించేటప్పుడు జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి తెలియజేయాలన్నారు. పర్యాటకులు అధికంగా వచ్చే సమయంలో అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కె.అద్దయ్య, డిఎస్‌పి సురేష్ కుమార్ రెడ్డి, పర్యాటక శాఖ (బోటింగ్) అసిస్టెంట్ మేనేజర్ గంగబాబు, పర్యాటక శాఖ డివిజనల్ మేనేజర్ పవన్‌కుమార్, తహశీల్దార్ సాయిరాజు, సహాయ పర్యాటక శాఖ అధికారి పట్టాభి, జిల్లా అగ్నిమాపక అధికారి, గోదావరి హెడ్ వర్క్స్ ఇఇ పాల్గొన్నారు.

ఎర్రకాలువ మిగులు భూములు పేదలకు పంచాలి

వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి

ప్రజాశక్తి - టి.నర్సాపురం

పేదల సాగు చేసుకుంటున్న భూముల్లో అక్రమంగా పశువులను మేపి పంటను ధ్వంసం చేస్తున్న భూస్వాములపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి డిమాండ్ చేశారు. మండలంలోని ఎర్రకాలువ మిగులు భూముల్లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, ఎర్రకాలువ భూ పోరాట కమిటీల సమావేశం మంగళవారం మడకం సుధారాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ భూముల అక్రమాలపై సెప్టెంబర్‌లో నిర్వహించే గ్రామ సభల్లో పేదలకు, దళితులకు, గిరిజనులకు న్యాయం జరిగేలా ఉండాలని కోరారు. ఇప్పటికే అన్యాక్రాంతమైన అసైన్డ్, సీలింగ్, రిజర్వాయర్ భూములను ఆక్రమణదారుల నుంచి రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలని కోరారు. ఈ ప్రాంతంలో గత పదేళ్ల నుంచి ఎర్రకాలువ రిజర్వాయర్ మిగులు భూముల కోసం దళితులు, గిరిజనులు, ఇతర పేదలు పెద్ద ఎత్తున పోరాటం చేస్తున్న సంగతి అందరికీ తెలిసిందేనన్నారు. ఈ భూముల్లో సాగు చేస్తున్న పేదలకు ఎక సాల్ పట్టాలు, పంట సాగు చేసుకునే అవకాశం కల్పించాలన్నారు. భూములు లేని పేదలు ఆ భూముల్లో వరి, మొక్కజొన్న, పత్తి వంటి పంటలు సాగు చేసుకునే విధంగా ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంట వేసిన భూముల్లో అన్యాయంగా పశువులను తోలి పంటను ధ్వంసం చేసిన భూస్వాములపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన మహిళల పట్ల అసభ్యకరంగా వ్యవహరించడంతోపాటు మహిళలను వ్యక్తిగతంగా దూషించడం, దాడి చేసేందుకు ప్రయత్నించిన భూస్వాములు, వారి బినామీలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ మాట్లాడుతూ టి.నర్సాపురం, జంగారెడ్డిగూడెం మండలాల్లో ఎర్రకాలువ రిజర్వాయర్ మిగులు భూముల్లో అక్రమ విద్యుత్ కనెక్షన్లు రద్దు చేయాలని కోరారు. అక్రమంగా విద్యుత్తు వినియోగిస్తున్నవారిపైన, చట్ట వ్యతిరేకంగా శాశ్వత పంటను వేసిన వారిపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేదల పట్ల ఒకరకంగా భూస్వాముల పట్ల మరొక రకంగా వ్యవహరిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు, ప్రభుత్వ ఉన్నతాధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, అధికారులు దళితులు గిరిజనుల పట్ల చిత్తశుద్ధితో ఎర్రకాలువ రిజర్వాయర్ మిగులు భూముల్లో పేదలకు పంట సాగుకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో ఎర్రకాలువ రిజర్వాయర్ మిగులు భూముల పోరాట కమిటీ అధ్యక్షులు పార్వతి, కార్యదర్శి మండపాటి రాజు, నాయకులు ఎంపీ సూర్యారావు, పోరాట నాయకులు బుద్ధల దుర్గమ్మ, రామలక్ష్మి, గాంధీ, చెల్లమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎ.రవి

విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ ఏలూరులోని స్థానిక యాదవ్ నగర్‌లో సూర్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌పై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో బాలికల మీద దాడులు పెచ్చుమీరుతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బయట వ్యక్తులే కాకుండా పరిచయమైన వ్యక్తులతో అయినా బంధువులతో కూడా జాగ్రత్తగా ఉండాలని, వారి ప్రవర్తన పైన ఎటువంటి అనుమానం వచ్చిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియచేయాలని సూచించారు. ఉన్నతమైన విద్యను అభ్యసించినప్పుడే పురుషులతో సమానంగా బాలికలు కూడా అభివృద్ధి చెందవచ్చని, జీవితంలో ఎదురయ్యే చిన్న చిన్న సమస్యలను అధిగమించి ఉన్నత విద్యను క్రమశిక్షణతో అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఎటువంటి సమస్య వచ్చినా ఒక ఉత్తరం ద్వారా గాని లేదా 08812 224555కు ఫోన్ ద్వారా గాని సంప్రదించవచ్చని, తగు న్యాయ సహాయం అందిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ లాయర్లు, కూనా కృష్ణారావు, పి.వెంకటేశ్వరరావు, ఎ.గంగాభవాని, ప్రిన్సిపల్ కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న రత్నప్రసాద్

ఉపాధ్యాయ ఓటర్ల జాబితా రూపకల్పన

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర శాసన మండలి తూర్పు, పశ్చిమగోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ నిమిత్తం ఉపాధ్యాయ ఓటర్ల నవీకృత జాబితా రూపకల్పనకు ఎన్నికల కమిషన్ జారీచేసిన షెడ్యూల్ ప్రకారం చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ఎంఇఒలు, ఎంపిడిఒలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో ఉపాధ్యాయ ఓటర్ల నమోదుపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2024 నవంబరు, 1 క్వాలిఫైయింగ్ తేదీగా ఓటరు జాబితా నవీకరణపై గత నెల 29న నోటిఫికేషన్‌కు సంబంధించి పబ్లిక్ నోటీసు జారీ చేశారన్నారు. ఈ నేపథ్యంలో తూర్పు, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎంఎల్‌సి నియోజకవర్గ ఓటర్ల నమోదు ప్రక్రియపై అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. నూతన ఉపాధ్యాయ ఓటర్ల నమోదుకు ఓటర్ల ఫారం-19 సమర్పించడానికి సెప్టెంబరు 3వ తేదీ అని, ఓటర్ల జాబితాపై క్లెయిమ్స్ అభ్యంతరాలు దాఖలు చేసేందుకు సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 15 వరకు అవకాశం ఉందన్నారు. అభ్యంతరాలను అక్టోబరు 30వ తేదీ నాటికి పరిష్కరించి తుది ఓటర్ల జాబితాను నవంబర్ ఆరో తేదీన ప్రచురిస్తారని తెలిపారు. దరఖాస్తులను ఎంఇఒల ద్వారా జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేట్ ఉన్నత పాఠశాలలు, ఐటిఐ, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, ఇంజినీరింగ్ కళాశాలలకు పంపినట్లు చెప్పారు.

18 వరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు ముందు జాగ్రత్త చర్యగా ఉచితంగా వేసే టీకాలను రైతులు తమ పశువులకు వేయించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఈనెల 20వ తేదీ నుంచి సెప్టెంబరు 18వ తేదీ వరకు జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం కింద పశు సంవర్ధక శాఖ వారి ఆధ్వర్యంలో పశువులకు టీకాలు వేయనున్నట్లు తెలిపారు.

త్వరలో 'సైబర్ సైనిక్' : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రతి స్కూలు పరిసర ప్రాంతాల్లో సీసీ టీవీలను ఏర్పాటు చేయనున్నట్లు ఎస్‌పి కె.ప్రతాప్‌శివకిషోర్ అన్నారు. ఏలూరు పట్టణ ప్రాంతంలో ఉన్న అన్ని కాలేజీలు, విద్యాసంస్థల ప్రిన్సిపల్, అధ్యాపకులతో పోలీస్ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఒక సీసీ టివి ఉంటే పదిమంది పోలీసువారు ఉన్నట్లేనన్నారు. ఏదైనా జరగరాని విషయం జరిగితే సీసీ టివిలో నిక్షిప్తమైన సమాచారం దర్యాప్తునకు చాలా ఉపయోగపడుతుందన్నారు. ప్రతి కాలేజీలో యాంటీ ర్యాగింగ్ కమిటీని నియమించాలని, విద్యార్థులకు సోషల్ మీడియా ద్వారా జరిగే అనర్థాల గురించి తరచూ అవగాహన కల్పించాలని, పోలీస్ సైడ్ నుంచి త్వరలో సైబర్ సైనిక్ అనే కార్యక్రమాన్ని తయారు చేస్తున్నట్లు చెప్పారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, దుష్పరిణామాలను తెలుసుకుని వాటికి దూరంగా ఉండాలని జిల్లా ప్రభుత్వాసుపత్రుల సమన్వయ అధికారి (డిసిహెచ్‌ఎస్) పాల్ సతీష్ అన్నారు. నారాయణపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మానసిక ఆరోగ్యం, మాదక ద్రవ్యాల వల్ల అరిష్టంపై విద్యార్థులకు అవగాహనా సమావేశం నిర్వహించారు. పిహెచ్‌సి వైద్యాధికారి కెఎస్.సుబ్బరాజువర్మ, మానసిక ఆరోగ్య కౌన్సిలర్ కోట శ్రీనివాస్, ఆరోగ్య కార్యకర్తలు రేలంగి పార్థసారధి, కామవరపు శ్రీనివాసరావు, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రతి గ్రామంలో పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలని జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాలసూర్యనారాయణరాజు (సూరిబాబు) సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం ఎంపిపి దారబోయిన లక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మక్కినవారిగూడెం సర్పంచి ఎం.గోపాలరావు మాట్లాడుతూ మర్రిగూడెంరోడ్డు అభివృద్ధి చేయాలని కోరారు. మండల వైద్యాధికారి జె.కల్పనారాణి మాట్లాడుతూ వైద్య సిబ్బంది కొరత ఉందని చెప్పారు. విద్యుత్ ఎఇ రామకృష్ణ మాట్లాడుతూ రాయితీపై రాష్ట్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పిస్తుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పలు అంశాలపై స్పందిస్తూ జెడ్‌పిటిసి సూరిబాబు మాట్లాడారు. ఎంపిడిఒ మంగాకుమారి మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి కొందరు అధికారులు గైర్హాజరు కావడంతో వారిని హెచ్చరించారు. వచ్చే సమావేశానికి హాజరు కాకుంటే చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి బుర్ల దివ్య భారతి, ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఉదయ్, ఎఒ సుమలత సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన

చింతలపూడి :స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు దోమల నివారణపై మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. హెల్త్ ఇన్స్పెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు మాట్లాడారు. చింతలపూడి మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎన్ఎ.ప్రసాద్, సచివాలయం వైద్య ఆరోగ్య సిబ్బంది, హెల్త్ సెక్రటరీ బి.విజయనిర్మల, హెల్త్ అసిస్టెంట్ సయ్యద్ జఫ్రూలా, కె.శ్రీనివాసరావు, ఆశా వర్కర్లు బి.శ్యామల, సిహెచ్.పుణ్యవతి ఐసిటిసి కౌన్సిలర్ అశోక్‌బాబు అవగాహన కల్పించారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ఆగిరిపల్లి :పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగద పరిశుభ్రత పాటించడం వల్ల సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చని సగ్గూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డి.మంజులాదేవి అన్నారు. సగ్గూరు పిహెచ్‌సి ఆధ్వర్యంలో మండల పరిధిలోని నరశింగపాలెం గ్రామంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు పలు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను అందించారు.

నేరాలు - ఘోరాలు

యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

తల్లి మందలించిందని మనస్తాపానికి గురైన యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని పాములవారిగూడెంలో సమీపంలోని కోళ్లఫారంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కామవరపుకోట గ్రామానికి చెందిన ఓ కుటుంబం పాములవారిగూడెంలోని ఓ రైతుకు చెందిన కోళ్ల ఫారంలో నివాసం ఉంటున్నారు. సోమవారం రాత్రి తల్లి కూతుర్ల మధ్య చిన్నపాటి గొడవైంది. దీంతో మనస్తాపానికి యువతి కోళ్ల ఫారంలోని కోళ్లకి ఇచ్చే మందును తాగింది. స్థానికులు గమనించి వెంటనే తాడువాయి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడి నుంచి జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందినట్లు తెలిపారు. తల్లి పిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు.

గుర్తు తెలీని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం - గణపవరం రాష్ట్రీయ రహదారిలో రావులపర్రు - రాచూరు మధ్యలో మంగళవారం రాత్రి చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. నిడమర్రు ఎస్‌సి కాలనీకి చెందిన యాళ్ల వినోద్‌కుమార్ (45) నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలీని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అదను అక్కడ కక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. రావులపర్రు విఆర్‌ఒ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ మణికుమార్ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - చింతలపూడి

పామాయిల్ లోడుతో వెళ్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని దేశవరం వద్ద పామాయిల్ లోడు లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న బట్టు శాంతారామ్ తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు అతడిని 108లో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఇద్దరు సిఐలు, 11 మంది ఎస్‌ఐలు బదిలీ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లా వ్యాప్తంగా ఇద్దరు సిఐలను బదిలీలు చేస్తూ ఏలూరు రేంజ్ డీఐజీ ఐజి అశోక్‌కుమార్, 11 మంది ఎస్‌ఐలను బదిలీలు చేస్తూ ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు జిల్లాలో ఎం.రమేష్‌బాబు ప్రస్తుతం ఏలూరు రేంజ్ విఆర్‌లో ఉన్నారు. ఆయనను కుక్కునూరు సిఐగా బదిలీ చేశారు. కుక్కునూరు సిఐగా పని చేస్తున్న ఉబ్బ శ్రీనివాసరావును ఏలూరు రేంజ్ విఆర్‌కు తరలించారు. అలాగే ఏలూరు జిల్లాలో పనిచేస్తున్న 11 మంది ఎస్‌ఐలకు స్థాన చలనం కలిగించారు.

బాల సదనం సందర్శన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు దండం గార్డెన్స్‌లోని బాల సదనాన్ని సిడిపిఒ ఎస్‌వై.నురానీ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతినెలా ఆరోగ్య పరీక్షలు నిర్వహించేటప్పుడు హెచ్‌బి టెస్టులు కూడా చేయాలన్నారు. తగిన ఆహారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

పలుచోట్ల రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

భారతరత్న, కీర్తిశేషులు రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి ప్రతాప సుబ్రహ్మణ్యశర్మ అధ్యక్షతన మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యశర్మ మాట్లాడుతూ భారతదేశానికి ఐటీని పరిచయం చేసి ప్రపంచ వ్యాప్తంగా భారతదేశం ఖ్యాతిని విస్తృంపజేసేలా ఆయన సేవలు చిరస్మరణీయమైనవన్నారు. .

భీమడోలు : భీమడోలు కేంద్రంగా మంగళవారం రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమాలను కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు యర్రం శెట్టి ఏడుకొండల ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి సత్కరించారు. సామాజిక కార్యకర్త మండే సుధాకర్, విశ్రాంత ఉపాధ్యాయులు వసంతరావుతోపాటు అధిక సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

సిహెచ్‌సిని పరిశీలించిన తహశీల్దార్

ప్రజాశక్తి - దెందులూరు

దెందులూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను తహశీల్దార్ జి.సుమతి మంగళవారం పరిశీలించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 30 పడకలతో పాటు అన్ని విభాగాల వైద్యులు సిబ్బంది సంతృప్తికరమైన సేవలకు ఇస్తున్నారని సూపరింటెండెంట్ సుందర్‌బాబు అన్నారు. రూ.2.50 కోట్లతో ప్రభుత్వం సిహెచ్‌సిని ఆధునీకరణ చేశారని, గతంతో పోలిస్తే అవుట్ పేషెంట్ ప్రతిరోజు 150 ఉంటుందని తహశీల్దార్‌కు వివరించారు.

ఆధార్ మొబైల్ క్యాంపుల నిర్వహణ వాయిదా

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు మండలంలో ఆధార్ మొబైల్ క్యాంపుల నిర్వహణ కార్యక్రమం వాయిదా పడిందని ఎంపిడిఒ పద్మావతిదేవి తెలిపారు. ఈ కార్యక్రమం ఈ నెల 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకు మూడు టీముల ఆధ్వర్యంలో వివిధ గ్రామపంచాయతీలో కొనసాగుతుందని తొలుత ప్రకటించారు. ఈ సందర్భంగా ఆధార్ నమోదుతో పాటు, నవీకరణ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కాని తాజాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆ కార్యక్రమం వాయిదా పడిందని, తిరిగి ప్రభుత్వ ప్రకటన వెలువడిన తర్వాత కొనసాగుతుందని ఎంపిడిఒ తెలిపారు.

22న మానవత శాంతి ర్యాలీ

ప్రజాశక్తి - భీమడోలు

స్వచ్ఛంద సంస్థ మానవత ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 22వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయిలో భీమడోలు కేంద్రంగా శాంతి ర్యాలీని నిర్వహించనున్నట్లు జిల్లా సమన్వయకర్త రామిశెట్టి గంగాధరరావు తెలిపారు. సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ఈ నెల 16వ తేదీ నుంచి 22వ తేదీ వరకు వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా భీమడోలు శాఖ అధ్యక్షులు గుడివాడ సీతారామాంజనేయులు ఆధ్వర్యంలో మంగళవారం భీమడోలు కేంద్రంగా శాంతి ర్యాలీలను నిర్వహించారు. దీనిలో భీమడోలు హైస్కూల్‌తో పాటు, మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల, పాలేటి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలకు చెందిన వందలాది మంది విద్యార్థుల భాగస్వామ్యంతో భీమడోలు వీధుల్లో శాంతి ర్యాలీలను నిర్వహించారు. ర్యాలీని భీమడోలు శాఖ అధ్యక్షులు ప్రారంభించారు. భీమడోలు జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడ్డారు.

ఏజెన్సీలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

విష జ్వరాలు ప్రబలకుండా ఏజెన్సీ గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అన్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఏజెన్సీలో విషజ్వరాలు ప్రబలతుండటంతో బుట్టాయగూడెంలోని కరాటం రంగనాయకమ్మ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కృష్ణచైతన్య మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వసుంధరతో మాట్లాడి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని ప్రతి వార్డును సందర్శించి రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ఏజెన్సీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్నారు.

రక్తహీనత నివారణపై అవగాహన

ఉంగుటూరు :అనీమియా ముక్తిభారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉంగుటూరు ఎంఇఒ కార్యాలయంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కాగుపాడు వైద్యాధికారిణి డాక్టర్ టి.మానస ఆధ్వర్యంలో అవగాహనా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం... ఐరన్ లోపం వల్ల ఏ రకమైన ఇబ్బంది కలగకుండా ముందస్తుగా విద్యార్థులందరి రక్తనమూనాలు సేకరించి మూడు నెలలకో సారి వారి ప్రగతి పరిశీలించి మైల్డ్, మోడరేట్, సివియర్ మూడు విభాగాలుగా వారిని గుర్తించి వివిధ దశల్లో ఉన్నవారికి ప్రత్యేకమైన చికిత్స అందించనున్నట్లు చెప్పారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

దెందులూరు :అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి అండగా ఉంటామని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ఎంఎల్‌ఎ చింతమనేనిని దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో పలువురు కూటమి నాయకులు, అధికా రులు, ప్రజలు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎం ఎల్‌ఎ దృష్టికి తీసుకురాగా సత్వరమే వాటిని పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

వణుదుర్రులో చెరువు అక్రమ తవ్వకం

పట్టించుకోని రెవెన్యూ అధికారులు

రొయ్యల చెరువు తవ్వకం పనులు చేస్తున్న జెసిబి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వణుదర్రు గ్రామ రెవెన్యూ పరిధిలో ఆక్వా చెరువు తవ్వకానికి గ్రామానికి చెందిన వ్యక్తి మంగళవారం శ్రీకారం చుట్టాడు. పచ్చని పంట పొలాల మధ్య రొయ్యల చెరువు తవ్వకం పనులు చేపట్టాడు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా ఆక్వా చెరువు తవ్వకం చేపట్టడంపై సరిహద్దు రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రెండు పంటలు పండే పొలాల మధ్య రొయ్యలు చెరువు సాగు చేస్తే తమ పొలాలు దెబ్బతింటాయని, ఉప్పు నీటి ఊట తమ పొలాల్లోకి వచ్చి తమ చేలు పంటలు పండే పరిస్థితి ఉండదని గ్రామ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక చెరువులోని మట్టిని సదరు వ్యక్తి ట్రాక్టర్ల ద్వారా బయటకు పంపిస్తూ మట్టిని విక్రయిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఈ రొయ్యల చెరువు తవ్వితే సమీపంలోని పంట పొలాలన్నీ పంటలు పండే పరిస్థితి ఉండదని చెబుతున్నారు. ఈ విషయాన్ని గ్రామ రెవెన్యూ అధికారులకు, తమశీల్దార్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ రొయ్యల చెరువు తవ్వకం వల్ల ఇప్పటికే నాట్లు వేసి ఉన్న పంట పొలాలు దెబ్బతిని పంట దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉందని రైతన్నలు చెబుతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి అక్రమ చెరువు తవ్వకం పనుల నిలుపుదల చేయాలని జిల్లా స్థాయి రెవెన్యూ అధికారులను రైతులు కోరుతున్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి చేయాలి

డిఎంహెచ్‌ఒ శర్మిష్ట

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మానవ సమాజాన్ని మలేరియా మహమ్మారి నుంచి కాపాడిన మహనీయుడు డాక్టర్ సర్ రోనాల్డ్ రాస్ అని ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.శర్మిష్ట అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ కేంద్ర కార్యాలయంలో బ్యానర్‌ను ఆయన మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం రోనాల్డ్ రాస్ చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం స్థానిక ఏలూరు కోటదిబ్బ కస్తూరిబా మున్సిపల్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కోట్లాది ప్రజలను మలేరియా మహమ్మారి నుంచి రక్షించిన మహానుభావుడు డాక్టర్ సర్ రోనాల్డ్ రాస్ అని అన్నారు. విద్యార్థులు దోమల నిర్మూలన గురించి తమ తల్లిదండ్రులకు చెప్పి అందులో భాగస్వాములు కావాలని కోరారు. దోమ కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, జ్వరం వస్తే అశ్రద్ధ చేయకుండా వైద్యులను వైద్య సిబ్బందిని సంప్రదించాలని చెప్పారు. ఎవరైనా తీవ్ర జ్వరం, చలి, వణుకు, చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉంటే మలేరియ జ్వరం కావచ్చని, తగు పరీక్షలు చేయించుకుని వైద్య చికిత్స పొందాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

విద్యార్థులు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థుల భవిష్యత్తుకు వారే బాటలు వేసుకోవాలని, పునది ఎంత బలంగా ఉంటే భవిష్యత్తులో అంత ఉన్నత స్థాయికి చేరుకుంటారని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని జూనియర్ కాలేజీలో మంగళవారం నిర్వహించిన పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.పది కోట్ల నిధులతో విద్యార్థులకు కిట్లు నారా లోకేష్ అందిస్తున్నారన్నారు. బడుగు బలహీన తరగతులకు ఈ కిట్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కాలేజీలో నేషనల్ వాలీబాల్, క్యాన్సర్ స్క్రీన్ టెస్ట్ నిర్వహించామన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు ఇతర వ్యాయామాలు, క్రీడలు, ఇతర నైపుణ్యాల పట్ల దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థుల్లో ఉన్న ఇతర టాలెంట్లను అధ్యాపకులు ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది ఉన్నా వెంటనే తను తెలియజేయన్నారు. జూనియర్ కాలేజీ అభివృద్ధికి ఎప్పుడు సహకరిస్తానన్నారు. పార్టీ నాయ కులతో చర్చించి కాలేజీ ఏ విధంగా అభివృద్ధి చేయాలనేది ప్రణాళిక సిద్ధం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ

ప్రజాశక్తి - భీమడోలు

పర్యావరణ పరిరక్షణతో పాటు, గ్రామపంచాయతీలకు అదనపు ఆదాయ వనరులుగా మారిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల సేవలపై అవగాహన కలిగి ఉండాలని భీమడోలు ఎంపిడిఒ సిహెచ్.పద్మావతి దేవి కోరారు. భీమడోలు మండల పరిషత్ సమావేశ మందిరం కేంద్రంగా పంచాయతీ పాలనపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు మంగళవారం రెండో రోజుకి చేరాయి. ఈ సందర్భంగా శిక్షణ తరగతుల సహాయ కోర్స్ డైరెక్టర్లుగా వ్యవహరిస్తున్న సూరప్పగూడెం గ్రామపంచాయతీ కార్యదర్శి ముత్తయ్య, అంబరుపేట గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకట్రావు సభ్యులకు పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, చెత్తను వేరు చేయడం, ఎరువుల తయారీ, మార్కెటింగ్ చేయడం అంశాలపై వివరించారు. దీనిలో భాగంగా క్లాప్ మిత్రులకు వారి విధుల పట్ల అవగాహన కల్పించారు. అనంతరం సభ్యులు ఎంపిడిఒ ఆధ్వర్యంలో భీమడోలులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పనితీరు పరిశీలించేందుకు క్షేత్ర సందర్శనను చేపట్టారు.

జీలుగుమిల్లి :మండలంలోని గ్రామ పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణలో భాగంగా మంగళవారం రెండో రోజు తాటియాకులగూడెం గ్రామ పంచాయతీ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో చెత్త నుంచి సంపద సృష్టించే విధానంపై శిక్షణ ఇచ్చినట్లు ఎంపిడిఒ కెఆర్ఎస్.కృష్ణప్రసాద్ తెలిపారు.

పెదపాడు : పెదపాడు మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలోని అన్ని పంచాయతీల గ్రామ సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి బత్తుల రత్నకుమారి, ఎంపిడిఒ తేజ రతన్, ఇఒపిఆర్‌డి సూర్యకుమార్ మాట్లాడారు.

నిర్వాసితుల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం : సిపిఐ

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టులో ముంపు నిర్వాసితుల సమస్యల పరిష్కార ప్రస్తావనే లేకపోవడం కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి తెలియజేస్తుందని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య విమర్శించారు. సిపిఐ మండల కార్యకర్తల సమావేశం మండల కార్యదర్శి జల్లేపల్లి వెంకట నరసింహారావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టులు ముంపు బాధితులకు కేటాయించిన పునరావాస గ్రామాల్లో మౌళిక వసతులు కల్పించలేదన్నారు.

ముసునూరులో ఆటల పోటీలు

ప్రజాశక్తి - ముసునూరు

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా ముసునూరు మండలంలో మంగళవారం ఆటల పోటీలు నిర్వహించినట్లు ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు తెలిపారు. పురుషులకు, మహిళలకు విడివిడిగా రెండు విభాగాలుగా నిర్వహించినట్లు చెప్పారు. 45 ఏళ్ల లోపువారికి పైబడిన వారికి విడిగా నిర్వహించినట్లు తెలిపారు.

ఉద్యోగావకాశాలు కల్పించాలని వినతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

గతంలో రాత్రి పూట బడిలో పనిచేసిన ఇన్‌స్ట్రక్టర్లు, సూపర్ వైజర్లకు ప్రభుత్వం ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ మంగళవారం పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజుకు ఆ సంఘం ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జనసేన మండల కన్వీనర్ అడపా నాగరాజు సమక్షంలో అందించారు. ఈ సందర్భంగా అడపా వెంకట్రావు, గుడెల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గతంలో దేశ వ్యాప్తంగా బాలకార్మికులకు, వయోజనులైన నిరాక్షరాస్యులకు రాత్రిపూట విద్యనందించే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త నిర్వహణలో (అనియత విద్యా కేంద్రాలను) రాత్రి పూట బడులు నిర్వహించారన్నారు. సదరు కార్యక్రమాలను 2001లో నిలిపివేశారని అప్పటి నుండి అనియత విద్యాకేంద్రాల ఇన్‌స్ట్రక్టర్లు, సూపర్ వైజర్ల సంఘం తరపున పోరాటం సాగిస్తూనే ఉన్నామన్నారు. అనేక పోరాటాల అనంతరం 2024 మే 3న అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని జిఒ విడుదల చేసిందన్నారు. సరైన న్యాయం చేయాలని కోరారు. ఇన్ స్ట్రక్టర్లు, సూపర్ వైజర్ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎంఎల్‌ఎ బాలరాజు చెప్పారు.

మొరాయించిన ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి - చింతలపూడి

ఏలూరు డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు మండలంలోని ఎర్రగుంటపల్లి వద్ద ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎండతీవ్రత, ఉక్కపోతతో పలు అవస్థలు పడ్డారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

మండలంలోని రేపాకగొమ్ము పంచాయతీ పరిధిలోని మద్దిగట్ల గ్రామంలో మంగళవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి డేవిడ్ ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామంలోని వీధుల్లో, గృహాల సముదాయాల్లో బ్లీచింగ్‌తో పాటు దోమల మందును పిచికారీ చేయించారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

ముసునూరు :ద్విచక్రవాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయరాదని ముసునూరు ఎస్‌ఐ పి.వాసు చెప్పారు. మండలంలోని ముసునూరు, చింతలవల్లి గ్రామ పరిధిలో ఉన్న ప్రధాన సెంటర్లలో వాహనదారులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనదారులు పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం, 31వ వార్డు, డోర్‌నెం.1-8-5/2 చెందిన సోమంచి V.S.K.చైతన్య, S/o.S.V.S.K.సూర్యనారాయణ అను నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. పాస్‌పోర్టు నెం.L5192355 మా ఇంటి వద్ద నుండి పెద్ద తాడేపల్లి రోడ్డు సమీపంలో నా మోటార్ సైకిల్ పై వెళ్ళుచుండగా మార్గం మధ్యంలో పడిపోయినది. దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అడ్రస్ : **సోమంచి V.S.K.చైతన్య,**
S/o.సూర్యనారాయణ,
బాపూజీనగర్, తాడేపల్లిగూడెం,
పశ్చిమ గోదావరి జిల్లా. సెల్: 93908 74694

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ వారి కోర్టులో

E.P.No.123/2014 in OS. No.186/2007

బిట్వీన్
ద్వారంపూడి సత్యనారాయణ రెడ్డి ...డిక్రీ హెూల్డర్
Vs
గుబ్బల చిట్టిబాబు ...జడ్జిమెంట్ డేట్టార్టు

గుబ్బల చిట్టిబాబు, S/o.వెంకట నరసయ్య మల్లవరం లంక, మల్లవరం, నరసాపురం మండలం.

పై నెంబరు EP గ్రంథములో జడ్జిమెంట్ డేట్టార్ యొక్క ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని ది 05-09-2024వ తేదీన ఉ.గం.10.30ని.ల లగాయతు పైన తెలిపిన కోర్టు నందు వేలం ద్వారా విక్రయించబడును. కావున కావలసిన వారు వేలంలో పాల్గొని క్రియం పొందగలరు.

Item No.1 పశ్చిమ గోదావరి జిల్లా. నరసాపురం సబ్-రిజిస్ట్రారులో చేరిన నరసాపురం మండలం, మల్లవరం గ్రామం లోని RS.no. 454/2లోగల య.1.00 సెంట్లు స్థలం దాని హద్దులు.
తూర్పు : గుబ్బల శ్రీనివాస్ గారి ఇల్లు గుబ్బల చిట్టిబాబు గారి ఇల్లు, పడమర : కొరు వెంకటరావుగారి స్థలం, దక్షిణము: డ్రైనేజ్ కెనాల్, ఉత్తరం : ఇరిగేషన్ కెనాల్
ఈ హద్దుల మధ్య య.1.00 సెంట్లు స్థలం మరియు అందులో గల ఫలవృక్షములు లీజుమెంటు హక్కులతో సహా
అమీనా విలువ Item.No.1 = Rs.4,00,000/-
DHR విలువ = Rs.2,13,541/-
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
పాలకొల్లు **యం.వెంకట రామిరెడ్డి**
ది.17-8-2024 అడ్వకేటు

24 వరకు గడువు

ఏలూరు అర్బన్ :రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేట్ డిగ్రీ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం రిజిస్ట్రేషన్ గడువును ఈ నెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు పెంచినట్లు ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు కోటదిబ్బలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉచిత సహాయ కేంద్రాన్ని సంప్రదించవచ్చని చెప్పారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR JUDGE: RANGA REDDY DISTRICT AT: L.B. NAGAR O.S. No. 510 of 2022

Between:-
'M/s. Mahesh Fats & Oil Limited' **...Plaintiff**

AND

1. M/s. Nexus Well – Hope Agritech International Limited, Rep by its Director, Goluguri Radha, Having its registered office at: Plot No. 62, Survey No. 137, Nagole Village, Mamatha Nagar Colony, Nagole Hyderabad.
2. Mrs. Goluguri Radha, Additional Director: M/s. Nexus Well – Hope Agritech International Ltd, R/o. F-8, Shiridi Sai Apt, Bhimavaram, West Godavari, A.P.
3. Mr. Goluguri veera Venkata Naga Satya Prabha, Director M/s. Nexus Well – Hope Agritech International Ltd, R/o. H. No. 26-8-28, Shiridi Sai Apt, 2 nd Floor, S-1, Bhimavaram, West Godavari District, A.P.

...Defendants

NOTICE

Please take notice that the above named Plaintiffs have filed the above suit for recovery of money, and the same is posted on 03-09-2024. You are required to appear before the above said Hon'ble court either in person or through Advocate on 03-09-2024 at 10.30 A.M. failing which you will be set exparte and the matter will be decided on the material available.

By the Order of the Court
Pawan Kumar Agarwal
Advocate
Counsel for the Plaintiff
Phone: 9246530236

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ వారి కోర్టులో

E.P.No 48/2019 in OS. No.116/2015

బిట్వీన్
పడాల వెంకట రామారెడ్డి ...డిక్రీ హెూల్డర్
Vs
1. లోపింటి సింహాచలం
2. లోపింటి శ్రీనివాసరావు
3. లోపింటి సత్య వరప్రసాద్
4. లోపింటి మధుసూదనరావు
5. లోపింటి బంగారమ్మ ...జడ్జిమెంట్ డేటార్టు

1. లోపింటి సింహాచలం, S/o.చిన్నయ్య, వ: 44 సం.రాలు పురుషుడు, వ్యాపారం, వేలమగుడెం, పాలకొల్లు
2. లోపింటి శ్రీనివాసరావు, S/o.చిన్నయ్య, వ : 44 సం. రాలు పురుషుడు, వ్యాపారం, విజయ క్లాత్ & రెడీమేడ్ షోరుం దేవునిహాలు దగ్గర, పాలకొల్లు
3. లోపింటి సత్యవరప్రసాద్, S/o.చిన్నయ్య, వ: 40 సం.రాలు పురుషుడు, వ్యాపారం, విజయ క్లాత్ & రెడీమేడ్ షోరుం దేవునిహాలు దగ్గర, పాలకొల్లు
4. లోపెంటి మధుసూదనరావు, S/o.చిన్నయ్య, వ: 34 సం.రాలు, పురుషుడు, వ్యాపారం, విజయ క్లాత్ & రెడీమేడ్ షోరుం దేవునిహాలు దగ్గర, పాలకొల్లు
5.లోపింటి బంగారమ్మ, W/o.చిన్నయ్య, వ: 66 సం.రాలు, స్త్రీ, గృహిణి, విజయ క్లాత్ & రెడీమేడ్ షోరుం దేవునిహాలు దగ్గర, పాలకొలు

పై నెంబరు EP గ్రంథములో జడ్జిమెంట్ డేటార్ యొక్క ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని ది 09-09-2024వ తేదీన ఉ.గం.10.30ని.ల లగాయతు పైన తెలిపిన కోర్టు నందు వేలం ద్వారా విక్రయించ బడును. కావున కావలసిన వారు వేలంలో పాల్గొని క్రియం పొందగలరు.

షెడ్యూలు

పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లు సబ్-రిజిష్టారులో చేరిన పాలకొల్లు మండలం, పాలకొల్లు మున్సిపల్ లిమిట్స్, మండేలవారి తోటలో గల TS.No. 424/2లో 145 చ.గ. స్థలము, దానిలో గల డోర్. నెం. 45-3-46/1 గల RCC రూఫ్ భవనమునకు హద్దులు.
తూర్పు : నామాని లక్ష్మీకాంతం గారి స్థలం
పడమర: లోపింటి బంగారమ్మ గారి ఇంటి స్థలం
దక్షిణము: మెయిన్ స్ట్రీట్
ఉత్తరం : బోది
అమీనా విలువ = Rs.14,00,000/-
DHR విలువు = Rs.5,00,000/-
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
పాలకొల్లు **యం.వెంకట రామిరెడ్డి**
ది.19/8/2024 అడ్వకేటు

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS AT NELLORE (Application for reference of a Dispute) DISPUTE NO.153 Of 2022

Between:
M/s.Kapil Chits (Kosta) Pvt.Ltd., ------- Disputant
Vs
Mr.Kantam.Chandra Sekhar, And Others ------- Opponents

Notice to Opponents 1 To 5
1) Mr.Kantam.Chandra Sekhar
S/o. Satyanarayana , Aged about 34 Years, Occ:Trainee Officer, SBI, Chinnapendiyal. R/o. D.No:6-17-12,Dasari Bairagi Street, Thuni(Vi), East Godavari D.t
2) Mr.Mutturu.Satya Narayana
S/o. Pedda Subbarao, Aged about 67 Years, Occ:Retired postman, Penioner, R/o.D.No.2-95, A.V Narayana, Thondangi, East Godavari Dist
3) Mrs.Chintamneni.Mathaji
D/o. Ramasatyanarayana, Aged about 34 Years, Occ: Asst Manager, APGVB, Peddagummuluru R/o.D.No.9-244/11/1, Indira Colony,Tuni(Vi), Visakapatnam Dist.
4) Mr.Garimella.Surya Narayana Visweswara Pradeep Kumar,
S/o. Yagneswara Somayajula Sarma, Aged about 34Years, Occ:SWO-III,SBI Main Branch, Palvancha, R/o.Plot.No. AA2, Madhyam, Behind Dr. Jeelani Hospital, Palvancha, Khamam Chavali Vari Street, Gandhi Nagar, East Godavari dt
5) Mr.Pothamsetti. Nagendra,
S/o. Rajababu, Aged about 26Years, Occ: Asst Manager, TGB, Bellampalli, R/o.Flot No:3-31A, Artlakota, Mangavaram, Visakapatnam Dist.

పై నెంబరున Disputant మీ మీద చీట్ బాకీ మొత్తము రాబట్టుకొనుటకు పైన తెలిపిన డి.ఆర్. ఆఫీస్ మీకు డి.సి.పి No 153 of 2022 నోటీసు నిమిత్తము తేది 30-08-2024 వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 11-00 గం. లకు మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని పైన తెలిపిన డి.ఆర్. ఆఫీస్లో హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలసినది, లేని యెడల మీ పరోక్షమున తీర్మానించడమైనది.

(By order of the Honourable Deputy Registrar)

Date: 30-08-2024

Advocate
Nellore.